నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



చందానగర్: హఫీజ్‌పేట్, మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు సుభాష్‌చంద్రబోస్ నగర్, ఆదిత్యనగర్, హనుమాన్ టెంపుల్, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- మాతృశ్రీనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మాతృశ్రీనగర్ పార్ట్ ఏరియా, ఎస్‌బిఐ ఏరియా, ఓల్డ్ సొసైటీ ఆఫీస్, మాధవనగర్ పార్ట్ ఏరియాలలో ..

వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

వేమన కాలనీ, మదీనాగూడ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

- శాంతినగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు శాంతినగర్, ఉషోదయ అపార్ట్‌మెంట్స్, ధర్మపురి టెంపుల్, దీప్తిశ్రీనగర్ ఏరియాలలో..
- భవానీపురం ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు వేమన రెడ్డి కాలనీ, భవానీపురం వీకర్ సెక్షన్, శంకర్‌నగర్ ప్రాంతాలలో..
- ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 6.30వరకు ఫ్రెండ్స్ కాలనీ, అర్జున్‌రెడ్డి కాలనీ, వెస్ట్ మెట్రో అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో ..
- సురక్ష ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యానగర్, సురక్ష కాలనీ, రాజేందర్‌రెడ్డి నగర్, శుభోదయ కాలనీ, సత్య ఎన్‌క్లేవ్, అపర్ణ హిల్ పార్కు ప్రాంతాలలో ..
- భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు భిక్షపతి కాలనీ, జవహర్ కాలనీ రోడ్డు నెంబర్ 4,5,6, శ్రీదేవి థియేటర్ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: నల్లగండ్ల హుడా కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ ఉండదని నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

- ఎన్టీఆర్ నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గోపన్‌పల్లి విలేజ్, ఎన్టీఆర్ నగర్, తాజ్‌నగర్, సోఫా కాలనీల్లో..
- నల్లగండ్ల హుడా 11 కేవీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు నల్లగండ్ల హుడా కాలనీలో ..
- లక్ష్మివిహార్ 11 కేవీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు లక్ష్మివిహార్ ఫేజ్-1, ఫేజ్-2 కాలనీతో పాటు డాక్టర్స్ కాలనీ, నల్లగండ్ల విలేజ్‌లలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారని ఏఈ తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నానక్‌రాంగూడ, బౌల్డర్‌హిల్స్, సుమధుర అపార్ట్‌మెంట్స్, అలేఖ్య అపార్ట్‌మెంట్స్, ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, రాయదుర్గం, ఖాజాగూడ, మధురానగర్, నిహారిక అపార్ట్‌మెంట్స్, ఎస్కి, బొటానికా అపార్ట్‌మెంట్స్, రాడిసన్ హోటల్, లీ మెరీడియన్ హోటల్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

ప్రజలు ఫిర్యాదు చేయకుండా చూడాలి



స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న శేరిలింగంపల్లి సర్కిల్ ఏఎంహెచ్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి

శేరిలింగంపల్లి సర్కిల్ ఏఎంహెచ్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని కాలనీలు ,బస్తీలలో గార్బేజ్ వనరబుల్ పాయింట్స్‌లో చెత్త వేయకుండా చూడాలని శేరిలింగంపల్లి సర్కిల్ ఏఎంహెచ్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి స్వచ్ఛ ఆటోల డ్రైవర్లను ఆదేశించారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం వద్ద స్వచ్ఛ ఆటోల డ్రైవర్లతో ఆయన శుక్రవారం సమావేశమై చెత్త సేకరణపై సమీక్షించి పలు సూచనలు చేశారు. చెత్త సేకరణకు ఆటో రావడం లేదని ప్రజలు ఫిర్యాదు చేయకుండా చూడాలన్నారు. కాలనీలు,బస్తీలలో ఈ పాయింట్ల వద్ద ప్రజలు చెత్త వేయకుండా చూడాలని, ఇలా జరగాలంటే ఇంటింటికీ వెళ్ళి చెత్త సేకరించాలని ఆయన సూచించారు. 30 నుంచి 40 రోజుల పాటు ఈ పద్ధతిని అనుసరిస్తే భవిష్యత్‌లో సమస్యలు రావన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే ఎస్ఎఫ్ఏ, ఎస్ఆర్‌పి లేదా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం చెత్త సేకరణ, పాయింట్ల తొలగింపుపై పలు సూచనలు చేశారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, ఎస్ఎఫ్ఏ, ఎస్ఆర్‌పీలు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో పారిశుధ్య నిర్వహణ, దోమల నివారణపై చర్యలు తీసుకోవాలని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం పారిశుద్ధ్యం, ఎంటమాలజీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య నిర్వహణలో లోపాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీ, బస్తీలలో అంతర్గత రహదారులను శుభ్రం చేయడంతో పాటు చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్, మురుగునీటిలో ఆయిల్‌బాల్స్ వేయాలని తెలిపారు. ప్రజల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు కనకరాజు, మహేష్, ఎంటమాలజీ ఏఈ గణేష్, రాజేష్, బాలాగౌడ్, ఎస్ఎస్ఏలు వినయ్, మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన..

మియాపూర్ డివిజన్ పరిధిలోని బీకే ఎన్‌క్లేవ్ కాలనీలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పరిశీలించారు. ఆయన వెంట బీకేఎన్‌క్లేవ్ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రమేష్ తదితరులున్నారు.

ఆరోగ్యశ్రీ ఈ కేవైసీ నమోదు పరిశీలన

ఆల్విన్‌కాలనీ: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని ప్రభుత్వం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పీజేఆర్ నగర్‌లోని మొగులమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డు ఈ కేవైసీ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఆరోగ్యశ్రీ భరోసానిస్తుందన్నారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్, జిల్లా గణేష్, రవి. సీహెచ్. భాస్కర్, పోశెట్టి గౌడ్, యాదగిరి, వాలి నాగేశ్వరరావ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యం అని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు స్పోర్ట్స్ యూనిఫామ్ కోసం తన వంతు సాయంగా రూ.25 వేలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం స్పందన చౌదరి కార్పొరేటర్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ గౌసుద్దీన్, ఉపాధ్యాయులు నరసింహులు, స్వామి ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన ట్రావెల్ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు

మియాపూర్: నో ఎంట్రీ సమయంలో ట్రావెల్ బస్సును నగరంలోకి తీసుకురావడమే కాకుండా అడ్డుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడిచేసిన బస్సు డ్రైవర్‌పై మియాపూర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మదీనాగూడ జాతీయ రహదారిపై ఆల్విన్ క్రాస్ రోడ్డు వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్స్ కె.మహేష్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డిలు గురువారం రాత్రి 9 గంటలకు విధులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో నగరంలోకి వెళ్లేందుకు మియాపూర్ వెళ్తున్న ఓ ప్రైవేటు క్లాసిక్ ట్రావెల్ బస్సును కానిస్టేబుల్ మహేష్‌బాబు ఆపి ప్రవేశంకు అనుమతి లేదని వెనక్కి తిరగమని బస్సు డ్రైవర్‌కు సూచించాడు. బస్సు డ్రైవర్ వాసిమ్ కానిస్టేబుల్‌ను పట్టించుకోకుండా బస్సును ముందుకు నడిపాడు. వెంటనే కానిస్టేబుల్ మహేష్‌బాబు బస్సులోకి వెళ్లి చెబుతుండగా డ్రైవర్ వాసిమ్ తలుపులు మూసి తాళం వేశాడు. మియాపూర్ బొల్లారం క్రాస్ రోడ్డు వరకు అతి వేగంగా బస్సును తీసుకెళ్లాడు. ఈ క్రమంలో వాసిమ్, కానిస్టేబుల్ మహేష్‌బాబు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. బస్సు డ్రైవర్ వాసిమ్ కానిస్టేబుల్ చొక్కా పట్టుకుని దుర్భాషలాడుతూ దాడి చేశాడు. అంతలోనే కానిస్టేబుల్ ట్రాఫిక్ సిబ్బందికి సమాచారం అందించడంతో మియాపూర్ బొల్లారం క్రాస్ రోడ్డు వద్ద వాసిమ్‌ను అదుపులోకి తీసుకుని మియాపూర్ పోలీసులకు అప్పగించాడు. క్లాసిక్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ వాసిమ్‌కు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించగా మద్యం సేవించినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో కానిస్టేబుల్ మహేష్ బాబు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. మద్యం తాగి బస్సు నడుపడంతో బాటు నో ఎంట్రీ సమయంలో నగరంలోకి రావడమే కాకుండా విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ పై దాడికి దిగిన డ్రైవర్ వాసిమ్‌పై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సమస్యలు పరిష్కరించండి

గౌలిదొడ్డి గురుకుల పాఠశాల/ కళాశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన



గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల/పాఠశాలల్లో డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గౌలిదొడ్డిలోని బాలికల కళాశాల/పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం, పేరెంట్స్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం 'టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్-సీఓఈ గురుకులాల భద్రత-తల్లిదండ్రుల బాధ్యత' అనే నినాదంతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులు మాట్లాడుతూ గురుకులాలల్లో ఇప్పటి వరకు కొనసాగిన కాంట్రాక్టు ఉపాధ్యాయులను కొనసాగించడంతోపాటు నెలవారీగా వారికి వేతనాలు అందించాలని, నాన్‌టీచింగ్ ఉద్యోగులకు వేతనాలు సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు పద్ధతిలో 8 ఏళ్లుగా కొనసాగుతున్న సబ్జెక్ట్ అసోసియేట్స్‌ను తొలగించడం న్యాయం కాదన్నారు. వారి స్థానంలో కొత్తగా వచ్చిన వారికి అనుభవం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ప్రాంగణంలో నిరసన తెలపాలని తల్లిదండ్రులు ప్రయత్నించగా పోలీసులు వారిని వారించి ప్రిన్సిపాల్‌తో మాట్లాడి, వినతిపత్రం అందించి వెళ్లేలా ఒప్పించారు. అనంతరం తల్లిదండ్రులు డిమాండ్లతో కూడి వినతిపత్రాన్ని ప్రిన్సిపాల్ కల్పనకు అందజేశారు.

నల్లగండ్ల చెరువును పరిశీలించిన హైడ్రా అధికారులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్ల చెరువును శుక్రవారం హైడ్రా అధికారులు పరిశీలించారు. జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో వారు చెరువు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అపర్ణ అక్రమాలను, చెరువులో రోడ్డు నిర్మాణం తదితర విషయాలపై హైడ్రా అధికారులకు పత్రాలను అందజేసినట్లు తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్

రాయదుర్గం: మాజీ మంత్రి కేటీరామారావును గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా శుక్రవారం నందినగర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. సాయిబాబా, కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ రంగారావు తదితరులు ఉన్నారు. శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ పార్టీని పటిష్టం చేయాలని కేటీఆర్ ఈ సందర్భంగా వారికి సూచించారు.

నాలా పనులు పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్, జ్యోతినగర్ కాలనీల మధ్య నిర్మిస్తున్న నాలా నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ పుష్పనగేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలని కోరారు.

దశలవారీగా మౌలిక వసతుల కల్పన

గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



గోపన్‌పల్లిలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రతి కాలనీ, బస్తీల్లో దశలవారీగా మౌలిక వసతులు కల్పిస్తామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లిలో రూ.50 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చే ప్రక్రియ కొనసాగుతోంద ని, పలు చోట్ల డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసిన తర్వాత సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. అనంతరం స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, సీనియర్ నాయకులు శేఖర్, సురేష్, రంగ స్వామి, మురుగ, రాజు చంద్రమౌళి, ప్రసా ద్, శ్రీనివాస్, స్థానికులు పాల్గొన్నారు.

ఆధునిక సాహిత్యానికి ఆద్యుడు గురజాడ



రాయదుర్గం: నవయుగ వైతాళికులు, ఆధునిక సాహిత్యానికి ఆద్యుడు గురజాడ వెంకట అప్పారావు అని హెచ్‌సీయూ తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య పిల్లల మర్రి రాములు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ తెలుగుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గురజాడ అప్పారావు జయంత్యోత్సవంను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్యాశుల్కం నాటకంలోని ప్రధానమైన సామాజిక దృక్పథం, తాను చూసిన సామాజిక సమస్యలను నాటకంగా రచించారని గుర్తు చేశారు. తెలుగు విభాగం పూర్వ అధ్యక్షుడు దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గురజాడ కథా సాహిత్యం, కవిత్వం గురించి విశ్లేషించారు. ఆచార్యులు పమ్మి పవన్‌కుమార్, గోనానాయక్, డి విజయలక్ష్మీ, పి వారిజారాణి, త్రివేణి, భూక్యా తిరుపతి, భుజంగరెడ్డి, విజయ్‌కుమార్, భాశెట్టిలత, విజయకుమారి, పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్కిలో 'ఏక్ పేడ్ మా కే నామ్'



ఎస్కి'లో మొక్క నాటుతున్న డైరెక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో అవసరమని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఎస్కి ప్రాంగణంలో 'ఏక్ పేడ్ మా కే నామ్' పేరిట మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెజాన్ అడవుల్లోని చెట్లు ప్రపంచంలోని 20 శాతం మందికి ఆక్సిజన్ అందిస్తున్నాయన్నారు. అందుకే అమెజాన్ అడవులను లంగ్స్ ఆఫ్ ది ఎర్త్ అంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చీఫ్ లక్ష్మీకాంతరావు, సివిల్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ ఆదినారాయణరావు, అధికారులు కెజే అమరనాథ్, డాక్టర్ కృష్ణప్రసాదరావు, అనితఅగర్వాల్, విద్యాసాగర్, రాజశేఖర్‌రెడ్డి, ప్రశాంత్, నరేష్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం

రాయదుర్గం: బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశం శనివారం జరుగుతుందని, ఆ పార్టీ నాయకుడు మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా తెలిపారు. ఖాజాగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులంతా ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుంది. ఇందులో 'బీయింగ్ అసెర్టివ్' అనే అంశంపై అమెరికాకు చెందిన బిహేవియర్ థెరపిస్ట్ బికే హర్ష ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. అనంతరం 'స్పిరిచ్యువల్ సిగ్నిఫికెన్స్ ఆఫ్ శ్రద్ధ్ (పితృపక్ష)' అనే అంశంపై కూడా ప్రసంగం ఉంటుంది. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

ప్రతి మహిళ సభ్యత్వం తీసుకోవాలి

ఆల్విన్‌కాలనీ: అఖిల భారత మహిళా కాంగ్రెస్ సభ్యత్వాన్ని ప్రతి మహిళ తీసుకోవాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ 40వ వార్షికోత్సవం సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో పార్టీ మహిళా నాయకురాళ్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్ సభ్యత్వాన్ని నమోదు చేయించారు. కార్యక్రమంలో రామకృష్ణ, సమ్మారెడ్డి, దుర్గారాణి, రాజ్యలక్ష్మి, మధులత, అరుణ, సౌందర్య, షేక్ బీబీ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

టాస్కులు, కమీషన్ పేరుతో సైబర్ మోసం

రూ.5 లక్షల 45 వేలు పోగొట్టుకున్న వ్యాపారి

పటాన్‌చెరు టౌన్: టాస్కులు, కమీషన్ పేరుతో ఓ వ్యాపారి నుంచి రూ.5 లక్షల 45 వేలు కాజేశారు సైబర్ మోసగాళ్లు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం...పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యాపారికి టాస్కులు, కమీషన్ పేరుతో సెప్టెంబర్ 5న ఓ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ వ్యాపారి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు.టాస్కులు పూర్తి చేస్తే పెట్టిన నగదుతో పాటు కమీషన్ వస్తుందని చెప్పి నమ్మించడంతో అతను పలుదఫాలుగా రూ.5 లక్షల 45 వేలు వేశాడు. చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు.

షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి మండల పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ డివిజన్‌ల పరిధిలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం 56 మంది లబ్ధిదారులకు రూ.56.6 లక్షల చెక్కులను శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ..పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ నాయకులు సంజీవరెడ్డి, ప్రసాద్, లక్ష్మీనారాయణ, జిల్లా గణేష్ పాల్గొన్నారు.

'మనూ'లో విద్యార్థుల ఆందోళన

రాయదుర్గం: హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందించాలని మనూలో విద్యార్థులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. పరిపాలనా భవనం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు తల్హామన్నన్ మాట్లాడుతూ మెస్‌లలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. తాము ఎన్నిసార్లు ఆందోళన చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు.

విద్యార్థి సంఘం ఎన్నికల వాయిదాపై ఆగ్రహం..

విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో విద్యార్థి సంఘం ఎన్నికలను అధికారులు రద్దు చేశారు.దీనిపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించి నిర్వహించాలని కోరారు. ఇదిలావుండగా విద్యార్థుల నిరసన నేపథ్యంలో పోలీసులు ప్రధాన గేటు వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి బయటి వారు లోపలికి వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.

గణనాథుడి సన్నిధిలో ఎమ్మెల్యే



చందానగర్: కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్‌లోని వినాయక మండపం వద్ద పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలను దృష్టిలో పెట్టుకొని మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణంను పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్, తిరుపతి, శ్రీనివాస్ చౌదరి, రజినీకాంత్, అక్షయ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు యజ్ఞంలా కొనసాగాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్



సభ్యత్వ నమోదులో పాల్గొన్న రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: బూత్ స్థాయి సభ్యత్వ నమోదు యజ్ఞంలా కొనసాగాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవి కుమార్ యాదవ్ పార్టీ నాయకులకు సూచించారు. శుక్రవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్, సిద్ధిఖీనగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండు లక్షల సభ్యత్వాలు లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రతి బూత్‌నుంచి 300 మందికి పైగా సభ్యులను నమోదు చేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పేర్కొన్నారు. టోల్ ఫ్రీ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చిన ప్రతి ఒక్కరికి సభ్యత్వం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఇన్‌చార్జ్ మహిపాల్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రాధాకృష్ణ యాదవ్, ఆంజనేయులు సాగర్, రవి నాయక్, ప్రసాద్ రెడ్డి, చందు, ఆత్మారాం, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాషా దినోత్సవం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ భాషా దినోత్సవం వారోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పాటల పోటీ, అంత్యాక్షరి ,రంగోలి పోటీలు నిర్వహించారు. ముగింపు రోజు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ విద్యార్థులకు హిందీ భాష ప్రాముఖ్యతను వివరించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 7 మందికి రూ. 2 వేల చొప్పున జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 7 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా,జడ్జి ఏడుగురికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.